క్లుప్తంగా

సాయిచైతన్య డిగ్రీ విద్యార్థుల ప్రతిభ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని శ్రీ సాయిచైతన్య డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ జి.రంగస్వామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విడుదల చేసిన డిగ్రీ 5వ సెమిస్టర్ బీకాం పరీక్ష ఫలితాల్లో కళాశాలకు చెందిన పి.పుష్పరాణి 700 మార్కులకు 585 మార్కులు, జి.బాలకృష్ణ 583 మార్కులు, పి.హరికృష్ణ 583 మార్కులు సాధించారు.

భవిత కేంద్రంలో చిన్నారులకు అన్నదానం


భోజనం వడ్డిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరెడ్డి

పొదిలి: స్థానిక భవిత కేంద్రంలోని పిల్లలకు శుక్రవారం పేరం చారిటబుల్ ట్రస్టు చైర్మన్, మండల సచివాలయాల కన్వీనర్ పేరం సుభాష్‌రెడ్డి, లక్ష్మి దంపతులు తమ కుమారుడు ప్రచేతన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేశారు. ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొని పిల్లలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో బాదం రఘురామిరెడ్డి, కేంద్రం ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, షాహిదా, ఆయా నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ

దర్శి: పెరటికోళ్ల పెంపకంపై దర్శి కృషి విజ్ఞాన కేంద్రంలో గిరిజన ఉపప్రణాళికలో భాగంగా శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ దుర్గాప్రసాదు మాట్లాడుతూ ఇది గ్రామీణుల అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. పశువైద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ లీలాకృష్ణ పెరటి కోళ్లపెంపకం వలన కలిగే ఉపయోగాలు , కోళ్లలో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యల గురించి వివరించారు. కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ఉష, డాక్టర్ శివ, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, టి. మానస, ఎం. జాహ్నవి పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు బాధ్యతగా వ్యవహరించండి

తాళ్లూరు (ముండ్లమూరు): ఓటర్ల జాబితా సర్వే సందర్భంగా బీఎల్‌ఓలు బాధ్యతగా పని చేయాలని దర్శి తహసీల్దార్ కాలే వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడారు. తప్పులు సరి చేసే క్రమంలో తగిన ఆధారాలు తీసుకోవాలన్నారు. డీటీ ఇమ్మానుయేలు, వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పాఠశాలను అక్కడే ఉంచాలి


మాట్లాడుతున్న ఆర్‌జేడీ సుబ్బారావు

పెద్దారవీడు: మండలంలోని గొబ్బూరు జెడ్పీహెచ్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ సుబ్బారావు శుక్రవారం నిర్వహించారు. జెడ్పీహెచ్ పాఠశాలను మరోచోటకు మార్చాలని కొంతమంది గ్రామస్తులు కలెక్టర్‌కు విన్నవించారు. గతేడాది నుంచి పాఠశాలలో నాడు-నేడు అదనపు తరగతుల భవన నిర్మాణం పనులపై విభేదాలు చోటుచేసుకున్నాయి. నాడు- నేడు గదుల నిర్మాణ పనులు నిలిచాయి. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయలు తెలుకునేందుకు సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రస్తుతం పాఠశాల గ్రామానికి దగ్గరలో ఉందని, ఉన్న చోటనే నాడు-నేడు పథకం ద్వారా మంజూరైన తరగతి గదుల నిర్మాణ పనులు కొనసాగించాలని కోరారు. మరో చోటకు మార్చితే పిల్లల రాకపోకలు తీవ్ర ఇబ్బందులు ఉంటాయని విన్నవించారు. కొంతమంది పాఠశాలను దూరంగా ఏర్పాటు చేయాలని చూస్తున్నారని, అలా చేస్తే విద్యార్థులు చాలా ఇబ్బందులు పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు కూడా ప్రస్తుతం ఉన్న చోటనే తరగతి గదుల నిర్మాణ పనులు చేపట్టాలని తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం నాడు- నేడు పథకం ద్వారా రూ.30 లక్షల నిధులతో 6 గదుల నిర్మాణం చేపట్టారని చెప్పారు. తల్లిదండ్రులు ప్రస్తుతం ఉన్న చోటనే పాఠశాలను ఉంచాలని, మరో చోటకు మార్చవద్దని అధికారులను వేడుకున్నారు. ఆర్జీడీ సుబ్బారావు మాట్లాడుతూ తల్లిదండ్రుల అభిప్రాయాల సేకరణతో నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులను పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జాలిరెడ్డి, ఎంపీడీఓ ఎం.నాసరురెడ్డి, ఎంఈఓలు పి.శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫిట్స్‌తో బాలుడి మృతి


రామకృష్ణ మృతదేహం

కంభం: ఫిట్స్ రావడంతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. వివరాలు.. అర్ధవీడు మండలం బొల్లుపల్లి గ్రామానికి చెందిన రామకృష్ణ (15) స్వగ్రామం వెళ్లేందుకు స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చాడు. ఉన్నట్టుండి ఫిట్స్ రావడంతో గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

సొంతింటి కల సాకారం!

- శరవేగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు
- మార్కాపురం నియోజకవర్గంలో 12,485 గృహాలు


పొదిలిలో వైఎస్సార్ జగనన్న కాలనీ

మార్కాపురం: పేదల సొంతింటి కల నెరవేరుతోంది. టీడీపీ జమానాలో నిర్లక్ష్యానికి, అవినీతికి చిరునామాగా మారిన గృహ నిర్మాణ శాఖకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చికిత్స చేసి సరైన గాడిలో పెట్టారు. పల్లెల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా కొత్త కాలనీలు రూపుదిద్దుకుంటున్నాయి. తమ సొంతింటికల నెరవేరిందన్న సంతోషం పేద ప్రజల్లో కనిపిస్తోంది. దగ్గరుండి స్వయంగా ఇళ్ల నిర్మాణాన్ని చేసుకుంటున్నారు. స్వయం సహాయక బృందాల్లో ఉన్న మహిళలకు ఆర్థికంగా చేయూత నిచ్చేందుకు వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా బ్యాంకు రుణాలు కూడా అందిస్తున్నారు. ప్రభుత్వమే ఇంటి నిర్మాణ సామగ్రి సమకూరుస్తుండటంతో జగనన్న కాలనీల్లో పనులు చకచకా సాగుతున్నాయి. ఎక్కడా ఇసుక కొరత రాకుండా చూడటంతోపాటు మార్కాపురం పొదిలి పట్టణాల్లో ఇల్లు కట్టించుకోలేని లబ్ధిదారులను గుర్తించి ఒక సంస్థ ద్వారా నిర్మాణ బాధ్యతలను అప్పగించారు. ఇడుపూరులో ప్రత్యేకంగా ఇటుకలు తయారు చేసే మిషన్లు కూడా ఏర్పాటు చేశారు. కాలనీల్లో నీటి సౌకర్యం కోసం డీప్‌బోర్లు వేసి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంతోపాటు కాలువలు, వీధిలైట్లు, రోడ్ల నిర్మాణం చేపట్టారు. విద్యుత్ సరఫరా కోసం ఇండోర్ సబ్‌స్టేషన్లు కూడా నిర్మిస్తుండటం గమనార్హం. మండలంలో వేములకోట, ఇడుపూరు లేఔట్లు మోడల్‌గా మారనున్నాయి.

నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణం ఇలా..

మండలం	మంజూరైన ఇళ్లు	పూర్తయిన ఇళ్లు
కొనకనమిట్ల	678	312
పొదిలి	2,487	410
పొదిలి అర్బన్	260	62
మార్కాపురం	1,406	371
మార్కాపురం అర్బన్	6,350	440
తర్లుపాడు	1,304	431

త్వరగా పూర్తి చేసుకోండి



ఇళ్లు మంజూరైన వారు త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవడానికి సహకారం అందిస్తాం. దశలవారీగా బిల్లులు చేస్తున్నాం. సొంత స్థలమున్న 2,316 మందికి ఇళ్లు మంజూరు చేయగా ఇప్పటి వరకు 1411 మంది గృహాలు నిర్మించుకున్నారు. లేఔట్లలో 6,012 మందికిగాను పలువురు స్పీడ్‌గా ఇల్లు కట్టుకుంటున్నారు. నియోజకవర్గంలో 12,485 గృహాలు మంజూరు చేయగా 2026 పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉంది.
– పవన్‌కుమార్, హౌసింగ్ డీఈ, మార్కాపురం

సీఎంకు ధన్యవాదాలు



మాకు ఇప్పటి వరకు సొంతిల్లు లేక చాలా అవస్థలు పడ్డాం. మా ఊరిలో చాలా మందికి హైవే పక్కన ఇంటి స్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తున్నారు. ఇన్నాళ్లకు మా కల నెరవేరుతుండటంతో చాలా సంతోషంగా ఉంది. జగనన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేస్తున్నాం.
– రూతమ్మ వేములకోట

కల నెరవేరుతోంది



నా సొంతింటి కల నెరవేరుతోంది. ఇన్నేళ్లకు ఇంటి నిర్మాణం చేపట్టాం. అధికారులు దగ్గరుండి సహకరిస్తున్నారు. ఎటువంటి ఇబ్బంది లేదు. జగనన్నకు ధన్యవాదాలు చెబుతున్నాం.
– సీహెచ్ విజయ రాణి, రాయవరం

తల్లిపాలు పిల్లలకు శ్రేష్టం


బృందావనంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ హేమలత


టీహెచ్‌ఆర్ పంపిణీ చేస్తున్న సర్పంచ్ అన్నపూర్ణమ్మ

ముండ్లమూరు: తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత తెలిపారు. మండలంలోని బృందావనం, జమ్మలమడకలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాడం వలన తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఆయా కార్యక్రమాలలో సూపర్‌వైజర్ యశోధ, అంగన్‌వాడీ కార్యకర్తలు సునీత, యశోద పాల్గొన్నారు.

దర్శి: మండలంలోని రాజంపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం టీహెచ్‌ఆర్ సర్పంచ్ వనం అన్నపూర్ణమ్మ చేతులమీదుగా పంపిణీ చేశారు. పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సర్పంచ్ కోరారు. అంగన్‌వాడీ కార్యకర్త డి. నరసమ్మ, ఆయా జి. చిన అంకమ్మ పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలోని మీర్జపేట అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సర్పంచ్ మీరయ్య, ఎంపీటీసీ సభ్యురాలు పార్వతీ రమేష్‌రెడ్డి హాజరయ్యారు. శిశువు పుట్టినప్పటి నుంచి రెండేళ్ల వరకు తల్లిపాలు ఇవ్వడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని వక్తలు సూచించారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కాశయ్య, సచివాలయం సిబ్బంది, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. పౌష్టికాహారంతో ఆరోగ్యం

కొనకనమిట్ల: మండలంలోని గనివానిపాడు, వాగుమడుగు గ్రామాల్లో పౌష్టికాహార వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకత, పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్‌లు పాలూరి లక్ష్మీసాంబ వెంకటేశ్వర్లు, భూదాల కమలాకర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


పౌష్టికాహారం అందిస్తున్న సర్పంచ్

లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ వరకుమార్

బేస్తవారిపేట: మండలంలోని అన్నీ పంచాయతీల పరిధిలో 2004 సంవత్సరానికి ముందు అసైన్‌మెంట్ పట్టాలు పొంది, పొలం సాగు చేసుకుంటూ, లబ్ధిదారులు మరణించి ఉంటే వారి వారసుల జాబితా సిద్ధం చేయాలని తహసీల్దార్ డీవీబీ వరకుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జాబితాను పారదర్శకంగా రెండు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఎటువంటి అవకతవకలకు పాల్పడిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సీసీఆర్‌సీ కార్డ్‌స్ మంజూరు చేయాలని సూచించారు. ఇంటింటి సర్వే ద్వారా ఓటరు జాబితాలోని మార్పులు, చేర్పులు, డిలీషన్ సక్రమంగా చేయాలని, 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తెలిపారు. డీటీ జితేంద్రకుమార్, ఆర్ఐ సలీం పాల్గొన్నారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత


పింఛన్ అందజేస్తున్న వలంటీర్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని 3వ వార్డు సచివాలయం పరిధిలో షేక్ బీబీ అనే వృద్ధురాలు అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ షేక్ మస్తాన్‌వలి హైదరాబాద్ వెళ్లి పెన్షన్ నగదు రూ.2750 అందజేశాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలలోని చికిత్స పొందుతూ ఆమె కుమారుడి ఇంటి వద్ద ఉంటున్న బీబీని వలంటీర్ వెతుక్కుంటూ వెళ్లి మరీ పెన్షన్ అందజేయడంతో బీబీతో పాటు ఆమె బంధువులు వలంటీర్ సేవలను కొనియాడారు.

పైసలిస్తేనే పనిచేస్తానంటున్న వీఆర్వో


కంభం తహసీల్దార్ కార్యాలయం

కంభం: ఓ వైపు ఏసీబీ అధికారులు జిల్లాలో వరుసగా దాడులు నిర్వహించి అవినీతి అధికారులను కటకటాల వెనక్కు నెట్టుతున్నా రెవెన్యూ శాఖలో కొందరి తీరు మారడం లేదు. అవకాశం వచ్చినప్పుడల్లా అందినకాడికి దోచుకుంటూ రైతులను ముప్పతిప్పలు పెడుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కొందరు వీఆర్వోలు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్యాలయానికి వచ్చిన వారిని కాళ్లరిగేలా తిప్పుతున్నారు. వారిలో ముఖ్యంగా చిన్న కంభం, హజరత్‌గూడెం, కాగితాలగూడెం పరిధిలో వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న రామయ్య విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సమస్యలతో వచ్చిన రైతులకు, విద్యార్థులకు పనులు చేయకుండా తిప్పుతుంటాడని ప్రజలు వాపోతున్నారు. పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నా, అడంగల్ కరక్షన్, ఇతర ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం ఇచ్చిన గడువు ప్రకారం చెయ్యకుండా తిప్పుతుంటాడని, గట్టిగా అడిగితే డాక్యుమెంట్లు కనబడటం లేదని, జిరాక్సులు మళ్లీ తెచ్చి ఇవ్వమని చెబుతూ కాలయాపన చేస్తుంటాడని చెబుతున్నారు. డబ్బులు ఇచ్చిన వారి పనులు మాత్రమే చేస్తాడని తీవ్రస్థాయిలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యాలయంలోపై అధికారులు సైతం సదరు వీఆర్వో పనులకు విసిగిపోతున్నట్లు తెలిసింది. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సదరు వీఆర్వోపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మునగపాడులో ఉచిత వైద్య శిబిరం


రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

కొనకనమిట్ల: మండలంలోని మునగపాడు గ్రామంలో శుక్రవారం పొదిలి పట్టణంలోని ఉడుముల హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ ఉడుముల అశోక్‌రెడ్డి, డాక్టర్ ఎస్‌వీ గీతికారెడ్డి పర్యవేక్షణలో ఆర్థోపెడిక్, జనరల్ మెడిషన్, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ జీవన్‌రెడ్డి, శ్రీనివాసులు, నీలా హారికలు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. తొలుత వైద్యశిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ పార్లపల్లి సిద్దానబి ప్రారంభించారు.

మాజీ సర్పంచ్ నాసర్‌రెడ్డి మృతి


నాసర్‌రెడ్డి (ఫైల్)


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉడుముల

కొనకనమిట్ల: మండలంలోని కాట్రగుంట గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు తేలుకుట్ల నాసర్‌రెడ్డి(82) అనారోగ్య కారణాలతో శుక్రవారం మృతి చెందారు. నాసర్‌రెడ్డి 2015 నుంచి ఐదేళ్ల పాటు గ్రామ కాట్రగుంట గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. ఆయన మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి నాసర్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నాయకులు గంగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రవీంద్రారెడ్డి, కందెర పెద్దన్న, మల్లికార్జున్, గ్రామ పార్టీ నాయకులు ఉన్నారు.

పచ్చళ్ల దుకాణంలో అగ్నిప్రమాదం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని చాణిక్య స్కూల్ సమీపంలో శుక్రవారం పచ్చళ్ల దుకాణంలో ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం సంభవించింది. అందిన వివరాల ప్రకారం.. పచ్చళ్ల దుకాణం యజమాని రవికుమార్ అనే వ్యక్తి పచ్చళ్ల తయారీ కోసం గ్యాస్ సిలిండ్ వెలిగించే సమయంలో ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. పచ్చళ్ల యజమానికి సుమారు రూ.50 వేల నష్టం జరిగింది.

గడప గడపలో ఆనందాల హరివిల్లు


వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలతో గడప గడపలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం రెండో రోజు వేములకోట గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ పాల్గొన్నారు. లబ్ధిదారుల గృహాలను అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్ జగన్ ప్రజలు పడుతున్న కష్టాలను చూసి వాటిని పరిష్కరించేందుకు నవరత్నాలు పథకాలను అమలు చేశారన్నారు. ఎటువంటి సిపార్సులు, రాజకీయాలు, కులమత భేదాలు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీలను నూరు శాతం నెరవేర్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. నాడు నేడు పథకం ద్వారా పాఠశాలలు, వైద్యశాలలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఇంటి వద్దకే రేషన్ సరుకులు వస్తున్నాయన్నారు. ముందుగా ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ గుంజి రాజేశ్వరి గురవయ్య, ఎంపీటీసీ సంధ్యాల వీరయ్య, పార్టీ నాయకులు జంకె వెంకట నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ చాగంటి నారాయణరెడ్డి, గుండారెడ్డి లక్ష్మిరెడ్డి, తిరుమలరెడ్డి రామిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జానపాటి ఆవులయ్య, ఎంపీడీఓ నరసింహులు, ఏపీఎం రమేష్, పంచాయతీ సెక్రటరీ నారాయణరెడ్డి, వీఆర్‌ఓ మల్లికార్జునరెడ్డి, మూల యల్లారెడ్డి, ఇంద్రసేనారెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం


హారతులిచ్చి ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న మహిళలు


సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: గడపగడపలో ప్రజల అవసరాలు తీర్చడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లక్ష్యంగా పని చేస్తోందని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. పట్టణంలోని 18వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. పలువురి సమస్యలను ఆయన అధికారులతో మాట్లాడి పరిష్కారం చేశారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు ఏం కావాలో తెలుసుకుని పని చేస్తున్నారని చెప్పారు. పాఠశాలల్లో నాడు- నేడు ద్వారా విద్యార్థులకు అన్నీ వసతులు కల్పించారని, ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదివేందుకు పేదరికం అడ్డు కాకూడదని అమ్మఒడి ఇస్తున్నారన్నారు. జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రతి ఇంటిని సందర్శించి వారి అవసరాలను తెలుసుకుని ఉచిత సేవలందించడం దేశంలోనే ఒక వినూత్న విజయమని చెప్పారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు హామీలన్నీ మాఫీ చేసి మేనిఫెస్టోని ఆన్‌లైన్‌లో కూడా లేకుండా చేసి ప్రజల ఆగ్రహానికి గురయ్యారన్నారు. ఇక ఎన్ని ఎన్నికలు వచ్చిన ఎప్పటికీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డే ఉంటారని స్పష్టం చేశారు. మండల పార్టీ కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, వార్డు నాయకులు కట్టికోట హరీష్, పట్టణ సచివాలయ కన్వీనర్ ఎదురుకోటి రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, వార్డు కౌన్సిలర్‌లు మోహన్ రెడ్డి, వీసీ రెడ్డి, బాబురావు, మోహన్‌బాబు, నారాయణరెడ్డి నగరపంచాయతీ కమిషనర్ మహేష్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దేవప్రసాద్, నాయకులు మిల్లర్‌బుజ్జి, రవి, జగన్, ఎర్రయ్య పాల్గొన్నారు.

ఇ- క్రాప్ నమోదు తప్పని సరి

దొనకొండ: రైతులు సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను ఇ- క్రాప్ బుకింగ్‌లో నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మంగినపూడి రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. మండలంలో 1088 మంది రైతులు ఇంకా ఈకేవైసీ చేయించుకోలేదని తెలిపారు.

తాళ్లూరు (ముండ్లమూరు): ఖరీఫ్‌లో సాగు చేసిన పంట వివరాలను రైతులు తప్పకుండా ఇ- క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి. ప్రసాదరావు అన్నారు. మాధవరంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. వీఏఏ సుధీర్, రైతులు పాల్గొన్నారు.

అర్హత ఉన్నవారందరికీ కౌలు రైతు కార్డులు

ముండ్లమూరు: అర్హగల ప్రతి రైతుకు కౌలురైతు కార్డు మంజూరు చేస్తామని వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ తెలిపారు. పెద ఉల్లగల్లు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం గ్రామ స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఇ- క్రాప్ నందు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. ఏఎంసీ డైరెక్టర్ అన్నపురెడ్డి భిక్షాలు రెడ్డి, పశుసంవర్ధక శాఖ జేవీఎస్ కోటిలింగం, వీఆర్‌ఓ రమణ పాల్గొన్నారు.

పింఛన్ అందజేత


నాగలక్ష్మమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దేవానంద్

దొనకొండ: ఒంగోలు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న దొనకొండ మండలం ఇండ్లచెరువుకు చెందిన సిరిపల్లి నాగలక్ష్మమ్మకు వలంటీర్ దేవానంద్ శుక్రవారం పింఛన్ అందజేశారు. ప్రభుత్వానికి తాను రుణపడి ఉంటానని, అదే విధంగా తమకు పింఛన్ అందజేయడానికి సహకరించిన పంచాయతీ కార్యదర్శి యల్లాబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి పంచాయతీలో మొక్కలు నాటాలి

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలని ఎంపీడీఓ వై. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఆగస్టు 15వ తేదీ నాటికి ప్రతి గ్రామ పంచాయతీలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలన్నారు. ఏపీఓ మురళి, ఈసీ ప్రసాద్ పాల్గొన్నారు.